క్లుప్తంగా

పవిత్రోత్సవాల్లో విశేషంగా పూర్ణాహుతి



పూర్ణాహుతిలో పాల్గొన్న వేద పండితులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు శుక్రవారం రాత్రి పూర్ణాహుతిని విశేషంగా నిర్వహించారు. అనంతరం కుంభ ప్రోక్షణ, పవిత్ర విసర్జన, రథబలి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దివ్యప్రబంధ పారాయణాలు, సింహాచలం క్షేత్ర మహత్యం, వేద మంత్రోశ్చటనలతో స్వామిని కీర్తించారు. ఉదయం ఆలయ శిఖరాలకు పవిత్ర సమర్పణ చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎన్టీపీసీ ఉద్యోగులకు క్విజ్ పోటీలు

పరవాడ: ఎన్టీపీసీ సింహాద్రి ఆధ్వర్యంలో ప్రాంతీయ స్థాయి 4వ మేధా ప్రతియోగిత పవర్ క్విజ్ పోటీలను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఈ పోటీలు అనేక విధాలుగా దోహదపడతాయన్నారు. దక్షిణ ప్రాంత ప్రధాన కార్యాలయాలతో పాటు వివిధ ఎన్టీపీసీ దక్షిణ ప్రాజెక్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 6 జట్లు 4 విభాగాల్లో పోటీపడ్డాయి. ఇందులో విజేతలైనవారు జాతీయ స్థాయి మేధా క్విజ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ హెడ్ బీబీ పాత్ర, క్విజ్ మాస్టర్ గౌతమ్ బోస్, సంస్థ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఆంజనేయశర్మ శివైక్యం



వడలి ఆంజనేయశర్మ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి విశ్రాంత వేదపండితులు వడలి ఆంజనేయశర్మ(83) గురువారం రాత్రి శివైక్యం పొందారు. 93వ వార్డు పరిధి ప్రహ్లాదపురంలో నివసిస్తున్న ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కోనసీమ జిల్లా ఏనుగుమహల్ గ్రామానికి చెందిన ఆంజనేయశర్మ కృష్ణ యజుర్వేద పండితులుగా సింహాచలం దేవస్థానంలో పని చేశారు. జ్యోతిష్యశాస్త్రంలో కూడా ఎంతో ప్రావీణ్యం పొందారు. వాస్తు పితామహుడిగా పేరొందారు. సింహాచలం శ్మశానవాటికలో మధ్యాహ్నం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. దేవస్థానం ఉద్యోగులు, అడవివరం గ్రామస్తులు ఆంజనేయశర్మ భౌతికకాయానికి నివాళులర్పించారు.

'మాకు న్యాయం చేయండి'



జెర్రిపోతులపాలెంలో నిర్మాణం వద్ద ఆందోళన చేస్తున్న బత్తిన బంగారయ్య

పెందుర్తి: తమకు చెందిన స్థలాన్ని ఆక్రమించిన సర్పంచ్‌పై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని జెర్రిపోతులపాలేనికి చెందిన దళితుడు బత్తిన బంగారయ్య కోరారు. ఈ మేరకు జెర్రిపోతులపాలెంలో తనదిగా చెబుతున్న సర్వే నెం.80/1లో జరుగుతున్న నిర్మాణం వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. కాగా తాను నిర్మాణం చేస్తున్న స్థలం సర్వే నెం.80/1 కాదని, అది సర్వే నెం.79/4 అని సర్పంచ్ అప్పలరాజు చెప్పారు. ఈ వివాదాస్పద స్థలంపై శనివారం సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తహసీల్దార్ వెంకట అప్పారావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



గెంజి రాజు

పరవాడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని సాలాపువానిపాలేనికి చెందిన గెంజి రాజు(45) ఈ నెల 3 నుంచి కనిపించడం లేదని అతని బంధువులు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు. వివరాలివి. ఆటో డ్రైవర్ రాజు ఈ నెల 3న ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి బయల్దేరి, ఎంతకీ ఇంటికి చేరుకోలేదు. ఆటో ఇంటి పక్కనే పార్క్ చేసి ఉంది. రాజు ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులు, తెలిసిన వ్యక్తులను రెండు రోజులుగా వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో అతని బంధువులు పోలీసులనాశ్రయించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వెంకన్నకు దధ్యాభిషేకం



స్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాత సేవ చేశారు. 120 లీటర్ల పెరుగుతో అభిషేకం(దధ్యాభిషేకం) జరిపారు. విశేష పూజల అనంతరం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

మూడు చక్రాల ఆటోనే వారికి మూడు పూటలూ తిండి పెట్టేది. ఆటో చక్రం తిరిగితేనే ఆటో డ్రైవర్ల కుటుంబాల బతుకు చక్రం కదిలేది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో వాహన మిత్ర కింద ఏటా రూ.10 వేలు ఠంచనుగా అందేది. ఆటో ఎక్కే ప్రయాణికులూ ఎక్కువగానే ఉండేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి పరిస్థితి మారింది. ఎన్నికల ముందు ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తామన్న హామీ అమలు దేవుడెరుక.. స్త్రీ శక్తి పథకంలో ఉచిత బస్సు ప్రయాణంతో తమ ఆటోల్లో ప్రయాణికులు తగ్గి బతుకులు రోడ్డున పడ్డాయని పరవాడ మండలంలోని ఆటో డ్రైవర్లు గగ్గోలు పెడుతున్నారు.

ఇటు ఆటో కాని బతుకులు



పరవాడ: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం ఆటో డ్రైవర్ల పాలిట శాపంగా మారింది. నిరుద్యోగులు, నిరక్షరాస్యులు చాలా మంది తమ కుటుంబ జీవనం కోసం ఆటోలపైనే ఆధారపడుతున్నారు. అలాంటి వీరికి ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గుదిబండగా మారింది. గతంలో రోజులో తిరిగే ట్రిప్పుల్లో నగం కూడా ఇప్పుడు తిరిగే పరిస్థితి లేకపోవడంతో ఆటో డ్రైవర్లు మానసికంగా కుమిలిపోతున్నారు.

ఇన్నాళ్లూ ఆటోలే పెద్ద దిక్కు

మండలంలోని పరవాడ, లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం, వాడచీపురుపల్లి, ఊటగెడ్డ కూడలి, పరవాడ సినిమాహాలు కూడలి, ముత్యాలమ్మపాలెం, దీపాంజలినగర్, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో సుమారు 540 ఆటోలు నడుస్తున్నాయి. మండల పరిధిలో బస్ సౌకర్యం లేని గ్రామాల నుంచి ప్రధాన మార్గాలకు ప్రయాణికుల్ని చేరవేసేందుకు ఆటోలే ఆసరాగా ఉండేవి. పట్టణ ప్రాంతాలకు కూరగాయలను తరలించడం, చిరు వ్యాపారులు కొనుగోలు చేసుకున్న సామగ్రిని వారి సొంత గ్రామాలకు చేర్చడంలో ఆటోలు అనుకూలంగా ఉండేవి. ఇప్పుడిదంతా చరిత్రగా మారే ప్రమాదం ఏర్పడింది.

బేరాల్లేక దిగాలు!

పరవాడ నుంచి వాడచీపురుపల్లి, గాజువాక, అచ్యుతాపురం ప్రాంతాలకు నడుస్తున్న బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఇప్పుడు ప్రయాణికులు దాదాపుగా ఆటోలను ఆశ్రయించడం మానేశారు. ఫలితంగా ఆటోలకు ఆశించినంత బేరాల్లేక రోజంతా ఆటో స్టాండ్‌లకే పరిమితం కావాల్సి వస్తోందని వాపోతున్నారు. లోకల్‌గా రోజుకు రెండు మూడు ట్రిప్పులు నడిపి సాయంత్రానికి ఖర్చులు పోనూ రూ.నాలుగైదు వందలతో ఇంటికి వెళ్లేవారు. ఇప్పుడు డీజిల్ ఖర్చు పోగా రూ.వందా రెండొందలు కూడా మిగలట్లేదని ఆటోవాలాలు వాపోతున్నారు. పెరుగుతున్న డీజిల్ ధరలు, ఆటోల మరమ్మతులు, బీమా, ఇతర ట్యాక్స్‌లు, నిర్వహణ వంటి ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆటో డ్రైవర్లు భయపడుతున్నారు.



పరవాడలో ప్రయాణికులు లేక ఖాళీగా ఉన్న ఆటోలు



ఆటోలు ఎక్కే ప్రయాణికుల్లేక వాడచీపురుపల్లి ఆటో స్టాండ్‌లో నిలిచిన ఆటోలు

మండలంలో ఆటోలు

ముత్యాలమ్మపాలెం	80
తిక్కవానిపాలెం	15
వాడచీపురుపల్లి	100
దీపాంజలినగర్	15
ఊటగెడ్డ కూడలి	16
సినిమాహాలు కూడలి	15
పరవాడ	35
మండల కాంప్లెక్సు	24
లంకెలపాలెం	120
తానాం	30
సాలాపువానిపాలెం	18
దేశపాత్రునిపాలెం	60
జాజులవానిపాలెం	12
మొత్తం ఆటోలు	540

హామీలు అమలు చేయలేదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేలు అందించేది. అధికారంలోకి వస్తే రూ.15 వేలు ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటి వరకు అమలు కాలేదు. తీరా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి, మాకు ఉపాధి లేకుండా చేశారు.

– షేక్ రహీమ్, ఆటో డ్రైవర్, వాడచీపురుపల్లి

ఆటోలు ఎక్కడం లేదు



ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చాక మహిళలతో పాటు పురుషులు కూడా ఆటోలు ఎక్కడం మానేశారు. బయటకు వచ్చే భార్యాభర్తలు భార్య ఫ్రీ బస్సెక్కితే భర్త కూడా ఆ బస్సే ఎక్కి వెళ్లిపోతున్నాడు. గతంలో రోజంతా కష్టపడితే ఖర్చులు పోనూ రూ.400 మిగిలేవి. ఇప్పుడు రూ.వంద కూడా మిగలట్లేదు.

– సర్వసిద్ధి అప్పలనాయుడు, ఆటోడ్రైవర్, పరవాడ

మా పొట్ట కొట్టారు



గతంలో రోజుకు రెండు మూడు ట్రిప్పులు వేసి నాలుగైదొందలు ఇంటికి తీసుకొచ్చేవాళ్లం. ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు తీరేవి. కూటమి ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం ద్వారా మా పొట్టకొట్టింది. ఫ్రీ బస్ తర్వాత ఒక ట్రిప్ కూడా కష్టంగా ఉంది. రూ.వంద మిగలడమే గగనమవుతోంది.

– నాగల ఈశ్వరరావు, ఆటోడ్రైవర్, ఊటగెడ్డ కూడలి

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోరుబాట

- రైతు సమస్యలపై ఈ నెల 9న ఆర్డీవోకు వినతిపత్రం
- మీడియా సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అదీప్‌రాజ్



పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి, రైతుల సమస్యలను గాలికి వదిలేసిందని, రైతుల పక్షాన పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ముందుంటుందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. సబ్బవరంలోని పార్టీ నియోజకవర్గ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ నేతృత్వంలో ఈ నెల 9న ఆర్డీవోకు వినతిపత్రం అందించనున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందే ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతోనని తెలిపారు. ఇందులో ప్రధానమైన అన్నదాత సుఖీభవ కింద రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పి, రెండేళ్లలో కేవలం రూ.7 వేలు వేసి, సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేశామని చెప్పడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. పెట్టుబడి సాయం అందక రూ.3, రూ.5 వడ్డీలకు తెచ్చుకుని రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లోనే విత్తనాలు, ఎరువులు అందిస్తూ మండల కేంద్రాల చుట్టూ తిరిగే తిప్పల్ని తప్పించారన్నారు. రైతు సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా రైతులకు అండగా పోరాడేందుకు సిద్ధమన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, బోకం రామునాయుడు, మండల కన్వీనర్ కర్రిబాబు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొటాన రాము, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్‌రాజ్, సీనియర్ నాయకులు వనం అచ్చెన్నాయుడు, ఉప్పిలి కనకరాజు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నదియా, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు బొడ్డేపల్లి హేమంత్, కోన రామారావు, గొరపల్లి ఎను, ఎంపీటీసీ కర్రి అప్పారావు, గొర్లి రాజేష్, చొప్పా నాగరాజు, రాపర్తి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం





జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న నరసింహం, అలివేలు మంగాదేవి

పెందుర్తి: పెందుర్తి విద్యాశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సొంతం చేసుకున్నారు. నగరంలో శుక్రవారం జరిగిన గురుపూజోత్సవంలో పెందుర్తి పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ చిన్నమ్మాయి, వేపగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పీవీఏ నరసింహం, వేపగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు టి.అలివేలుమంగాదేవి అవార్డులు అందుకున్నారు.

అన్ని బంధాల కంటే గురు శిష్యుల బంధం ఉత్తమం



05జిపియల్95: సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: అన్ని బంధాల కంటే గురుశిష్యుల బంధం ఉత్తమమైనదని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవంలో పాల్గొని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సత్కరించారు. తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పద్మజ, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, కొటాన రాము, ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు, బైలపూడి దేముడుబాబు పాల్గొన్నారు.

గురువులకు ఘన సత్కారం



ఉపాధ్యాయుల్ని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల విష్ణుమూర్తి, తదితరులు

సింహాచలం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో అప్పన్నపాలెంలోని బాలాజీ హిల్ వ్యూ ఎన్‌క్లేవ్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిల్‌వ్యూలో నివాసం ఉంటున్న పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులను, ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులను సత్కరించారు. ఒకే దగ్గర నివాసం ఉంటున్న తమను సహచర నివాసులతో కలిసి సన్మానం చేయడం పట్ల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. పీతల విష్ణుమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు.

అప్పన్నను దర్శించుకున్న కేంద్రప్రభుత్వ కార్యదర్శులు



అప్పన్న ఆలయంలో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని కేంద్ర న్యాయశాఖ, న్యాయ వ్యవహారాల విభాగం కార్యదర్శి డాక్టర్ అంజు రతిరాణా, కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శి దీప్తి ముఖర్జీ శుక్రవారం దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రంలను ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు అందించారు.


ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



పరవాడలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్ నాగరాజు, వ్యవసాయాధికారి రమాదేవి

పరవాడ: అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు పరవాడ తహసీల్దార్ బి.నాగరాజు, మండల వ్యవసాయాధికారి రమాదేవి తమ సిబ్బందితో పరవాడ, పెదముషిడివాడ, నాయుడుపాలెం ప్రాంతాల్లోని ఎరువుల దుకాణాలు, రైతు సేవా కేంద్రాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పరవాడ గ్రామంలోని మూడు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, ఎరువుల నిల్వలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. పెదముషిడివాడ, నాయుడుపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సందర్శించి అక్కడ ఎరువుల నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాయుడుపాలెం, పెదముషిడివాడ రైతు సేవా కేంద్రాల్లో 9.345 టన్నుల యూరియా, ప్రైవేట్ ఎరువుల దుకాణాల వద్ద 11.249 టన్నుల ఎరువులు ఉన్నట్లు గుర్తించారు. ఎరువుల కొరతను సృష్టించి, ధరలు పెంచి అమ్మకాలు జరిపే డీలర్లపై చర్యలు తప్పవని తహసీల్దార్ నాగరాజు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

గణపతి సన్నిధిలో అదీప్‌రాజ్ పూజలు



రాంపురం ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన గణపతిని దర్శించుకుంటున్న అదీప్‌రాజ్

పెందుర్తి: రాంపురం ఎస్సీ కాలనీలో కొలువుదీరిన గణపతి మండపాన్ని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర యువజన విభాగం అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుక్రవారం సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు శంకర్రావు, హరీష్, సురేంద్ర, చిన్ని, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: దారపాలెం ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు కారణంగా శనివారం విద్యుత్ సంఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలంనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో అడవివరంలోని కుమ్మరిదిబ్బ, పాత అడవివరం జంక్షన్, ఏఎంజీ, భైరవవాక, ఎస్ఆర్ పాలెం, దారపాలెం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

అప్పన్న సన్నిధిలో మజ్జి శ్రీనివాసరావు



అప్పన్న ఆలయంలో కప్పస్తంభానికి మొక్కుకుంటున్న మజ్జి శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని వైఎస్సార్‌సీపీ భీమిలి ఇన్‌చార్జ్, విజయనగరం జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్నశ్రీను) శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రంలను ఏఈవో తిరుమలేశ్వరరావు అందించారు.



మజ్జి శ్రీనివాసరావుకు అప్పన్న చిత్రపటాలను అందిస్తున్న 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

పార్టీ శ్రేణుల సత్కారం

దర్శనార్థం సింహాచలం వచ్చిన మజ్జి శ్రీనివాసరావుకు కొండదిగువ ఘాట్‌రోడ్డు ప్రవేశం వద్ద 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. దుశ్శాలువాలతో సత్కరించారు. సింహగిరిపై ఆలయ రాజగోపురం వద్ద స్వామివారి చిత్రపటాలను అందించారు. వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, పార్టీ నాయకులు కర్రి సత్తిబాబు, పీతల అప్పలరాజు, లంక సత్తిబాబు, బోర మోహన్‌రెడ్డి, దమ్ము ఎర్రాజీరావు, బోర కృష్ణారెడ్డి, ఆదిరెడ్డి, తెడ్లపు మహేష్, బోర ప్రసాద్‌రెడ్డి, ఎస్.అప్పారావు, మజ్జి ధర్మా, టి.రాము, శిడగం తాతబాబు తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూ సిబ్బందిపై కార్పొరేటర్ సోదరుడి దౌర్జన్యం

- చినముషిడివాడలో రూ.5 కోట్ల ప్రభుత్వ భూమికి ఎసరు
- ఆక్రమణదారులకు జీవీఎంసీ ముఖ్య ప్రజాప్రతినిధి, టీడీపీ నేత అండ!



పొక్లెయిన్ కింద నిల్చుని తొలగింపును చర్యల్ని అడ్డుకుంటున్న బీజేపీ కార్పొరేటర్ సోదరుడు

పెందుర్తి: చినముషిడివాడలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపడుతున్న గొడౌన్ నిర్మాణంపై చర్యలకు దిగిన రెవెన్యూ సిబ్బందిని బీజేపీ కార్పొరేటర్ ముమ్మన దేముడు సోదరుడు దాలినాయుడు అడ్డుకుని, దౌర్జన్యానికి దిగారు. ఇక్కడ సర్వే నెం.109, 109/2, 92/2లో ప్రభుత్వం కాలనీలకు కేటాయించగా దాదాపు రెండెకరాల భూమి ఓ కుటుంబం కబ్జాలో ఉంది. దీనిపై చాలా ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. అందులో కూడా గతంలో చాలా నిర్మాణాలు జరిగిపోయాయి. ప్రస్తుతం 800 గజాల్లో నిర్మాణం కోసం తప్పుడు డాక్యుమెంట్‌తో పాటు ఓ పట్టాను ఏర్పాటు చేసుకున్నారు. ఆ స్థలంలో నివాసాల(వాస్తవానికి భారీ గొడౌన్)కు దరఖాస్తు చేసుకున్నారు. పత్రాలు సక్రమంగా లేకపోవడంతో జీవీఎంసీ తిరస్కరించింది. ఎట్టిపరిస్థితిలోనూ ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టొద్దని గత నెలలో నోటీసులు జారీ చేసింది. రెవెన్యూ అధికారులు కూడా ఆ నిర్మాణాన్ని నిలుపుదల చేశారు. అయినప్పటికీ గురువారం ఉదయం నుంచి దాదాపు 100 మంది కూలీలను పెట్టి రేయింబవళ్లు గొడౌన్ నిర్మాణం చేపడుతున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకట అప్పారావు ఆదేశాలతో ఆర్ఐ హరిప్రసూన బృందం గురువారం రాత్రి కబ్జాను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ బృందంపై కార్పొరేటర్ సోదరుడు దాలినాయుడు దౌర్జన్యానికి దిగాడు. మా స్థలం మా ఇష్టం అంటూ చిందులు తొక్కాడు. జీవీఎంసీ ప్రజాప్రతినిధితో పాటు టీడీపీ ముఖ్య నేత ఒకేసారి ఫోన్ చేయడంతో చేసేది లేక జీవీఎంసీ, రెవెన్యూ యంత్రాంగం అక్కడి నుంచి వెనుదిరిగింది. దీనిపై ఆర్ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.



ప్లాన్ లేకుండా నిర్మాణం చేయొద్దని జీవీఎంసీ ఇచ్చిన నోటీసు

క్యాన్సర్ రోగికి అరుదైన రక్తదానం

స్ఫూర్తిగా నిలిచిన దాత అనిల్‌కుమార్

పెందుర్తి: చిన్న వయసులోనే ఓ యువకుడిని ప్రాణాంతక వ్యాధి కబళించింది. చికిత్స కోసం అరుదుగా అవసరమైన మూలకణ మార్పిడి జరగాలి. దీనికి దాత ముందుకు రావాలి.. ఎంతో సహనంతో ఉండాలి.. రిస్కును ఎదుర్కోవాలి.. అందుకు సిద్ధమయ్యాడు పెందుర్తి మండలం చింతలగ్రహారానికి చెందిన ఎల్లపు అనిల్‌కుమార్. వివరాలివి.. తాడేపల్లిగూడేనికి చెందిన సీహెచ్ సుగుణ్ కుమార్(21) అప్లాస్టిక్ అనీమియా(ఎముకల్ల రక్త కణాల వృద్ధి పూర్తిగా లోపించడం) అనే వ్యాధికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం నగరంలోని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పతిలో చేర్చారు. తొలి దశలో సుగుణ్‌కుమార్ తండ్రి ద్వారా మూలకణ మార్పిడి చికిత్స చేశారు. వెనువెంటనే అతనికి బి పాజిటివ్ రక్తం ఉన్న వ్యక్తి తెల్లరక్త కణాలు అవసరమయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ కీలక సభ్యుడు ఎల్లపు అనిల్‌కుమార్ ముందుకొచ్చాడు. క్యాన్సర్ ఆస్పత్రిలోని ప్రత్యేక గదిలో రక్తకణాల వృద్ధి కోసం ప్రత్యేక ఇంజెక్షన్ తీసుకున్నాడు. సాధారణంగా మనిషిలో 4 వేలు నుంచి 11 వేలు వరకు తెల్లరక్తకణాలు ఉంటాయి. దానం చేయాలంటే ఇంజక్షన్ ద్వారా వాటిని 36 వేలు వరకు పెంచాలి. ఇది జరిగాక అనిల్‌కుమార్ నుంచి తెల్లరక్త కణాలు సేకరించిన వైద్యులు సుగుణ్‌కు ఎక్కించి చికిత్స పూర్తి చేశారు.



మూలకణ మార్పిడి ద్వారా రక్తదానం చేస్తున్న సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి అనిల్‌కుమార్